ఆయుష్షు పోస్తున్న ఆరోగ్య మందిర్

- రోగులకు అండగా...సేవలు మెండుగా
- దీర్ఘకాలిక వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు
- కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాల పనితీరు భేష్
- హోమియో వైద్యంపై ప్రజల ఆసక్తి



కోరంగిలోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రి


విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న ట్రైనర్ (ఫైల్)


ఆస్పత్రిలో యోగాపై శిక్షణ ఇస్తున్న మహిళా ట్రైనర్

తాళ్లరేవు: అల్లోపతి వైద్యం వాడవాడలా విస్తరించిన నేటి రోజుల్లోనూ పురాతన హోమియో వైద్యాన్ని అందిస్తూ అందరినీ ఆకర్షిస్తోంది కోరంగిలోని ఉచిత హోమియో వైద్యశాల. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఆయుష్ విభాగం) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆస్పత్రి అనేక మందికి వైద్య సేవలందిస్తూ రోగులకు అండగా నిలుస్తోంది. వైద్య సేవలతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్నందించే యోగాలో చిన్నారులకు, మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, తదితర సేవలతో ప్రజల మన్ననలు చూరగొంటోంది. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ఇక్కడికి వచ్చి ఆస్పత్రి సేవలతో సాంత్వన పొందుతున్నారు. మండల పరిధిలోని కోరంగిలో సుమారు 30 ఏళ్ల క్రితం ఉచిత హోమియో ఆస్పత్రి సేవలను ప్రారంభించారు. కొన్ని రోజులపాటు అద్దె భవనంలో కొనసాగిన ఈ ఆస్పత్రికి పాలేశ్వరరాజు అనే దాత స్థలాన్ని ఇవ్వడంతో సేవలు సొంత భవనంలోకి మారాయి. గతంలో వివిధ ఆస్పత్రులకు ఒకే వైద్యుడు ఉండడంతో వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే సేవలు అందేవి. అయితే గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు నిధులతో ఆస్పత్రిని అభివృద్ధి చేసి పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించారు. దీంతో నిత్యం వైద్య సేవలను అందించడంతోపాటు అనేక మంది తరలి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.

యోగ సాధనతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి

ఈ ఆస్పత్రిలో వైద్య సేవలతోపాటు పురాతన ఆరోగ్య ప్రక్రియ అయిన యోగా శిక్షణ ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి అనేక మందికి విముక్తిని కల్పిస్తున్నారు. ఒక మహిళా ట్రైనర్ ప్రతిరోజూ యోగాపై శిక్షణతోపాటు అనేక మెలకువలు నేర్పిస్తున్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి యోగా ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఒక యోగా ట్రైనర్ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. విద్యార్థుల్లో మార్పు తీసుకురావడంతో సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరించే ఔషధ మొక్కలను పెంచుతూ వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల అధిక శాతం మంది కాళ్లు, చేతులు, మెడ తదితర నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చేవారికి మందులతోపాటు యోగా థెరపీ ద్వారా సంబంధిత ఆసనాలను వేయించి నయమయ్యేలా చేస్తున్నారు. దీంతో ఉచిత హోమియో వైద్యంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

ఓపీ బాగా పెరిగింది



గతంలో కన్నా ఇప్పుడు ఓపీ బాగా పెరిగింది. ఆస్పత్రి భవనాన్ని అభివృద్ధి చేయడంతోపాటు పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి సైతం రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.ఆరోగ్యంతోపాటు దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ప్రత్యేక యోగా ట్రైనర్ల ద్వారా విద్యార్థులకు, మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– ప్రియాంక, వైద్యాధికారి, ప్రభుత్వ హోమియో వైద్యశాల కోరంగి

దీర్ఘకాలిక వ్యాధులు నయం



ఈ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందించడంతోపాటు దీర్ఘకాలిక వ్యాధులను రూపాయి ఖర్చు లేకుండా నయం చేస్తున్నారు. 30 ఏళ్లుగా మా కుటుంబ సభ్యులు హోమియో వైద్య సేవలు పొందుతున్నాము.

– డి.అప్పారావు, కాకినాడ

సాంకేతికతలో భారత్ గ్లోబల్ లీడర్

కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సర్వేశ్వరశర్మ



సభలో మాట్లాడుతున్న కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్: సాంకేతికతలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతోందని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. ఏటా మే 11న నిర్వహిస్తున్న జాతీయ సాంకేతిక దినోత్సవంతో ఆ ఎదుగుదల మరీ స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా స్థానిక కృష్ణవేణి స్కూల్లో బుధవారం నిర్వహించిన కోనసీమ సైన్స్ పరిషత్ 2014వ సభలో డాక్టర్ సర్వేశ్వరశర్మ మాట్లాడారు. ఐటీ, బయో టెక్నాలజీ, ఏరో స్పేస్, న్యూక్లియర్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్, కంప్యూటర్ వంటి రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతి సాధిస్తూ గ్లోబల్ లీడర్ దిశగా అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు. నన్నయ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశం సాధిస్తున్న సాంకేతిక విజయాలను వివరించారు. కృష్ణవేణి స్కూలు ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎమ్.శ్యామలరావు, డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో ఉద్యోగుల నైపుణ్యాలు మెరుగు


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: రాష్ట్రంలో ఏ జిల్లాలో చేపట్టని విధంగా వినూత్న రీతిలో ఉద్యోగుల్లో సామర్థ్యలను పెంపొందించేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, సర్వే ఉద్యోగులకు మండలానికి ఎనిమిది మంది చొప్పున ఎంపిక చేసి క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి క్విజ్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. రెవెన్యూ సర్వే ఉద్యోగుల విధి నిర్వహణలో భాగంగా సమర్ధవంతంగా విధులు నిర్వహించేలా స్పష్టమైన అవగాహన ఏర్పడేలా క్విజ్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి, ఆర్డీవోలు పీ. శ్రీకర్ కే మాధవి, డీ అఖిల, జిల్లా పౌర సరఫరా అధికారి అడపా ఉదయ్ భాస్కర్, ఏవో కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి సంజీవయ్య


మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య 53వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జై బుద్ధ పార్కు వద్ద అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా అణగారిన వర్గాల ఆశయ సాధనకు కృషి చేయడంతోపాటు రాజ్యాంగ విలువలను కాపాడి అందరి మన్నలను పొందిన మహోన్నత వ్యక్తి సంజీవయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాశి సింహాద్రివర్మ, బొజ్జా బాలకృష్ణ, దాసరి సత్యనారాయణ, వడ్డి శ్రీనివాస్, కాశి శ్రీను, రేవు త్రిమూర్తులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సాధనే లక్ష్యంగా పోరాడిన అల్లూరి


అల్లూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: దేశానికి స్వాతంత్య్ర సాధనే లక్ష్యంగా బ్రిటీషు వారిని ఢీకొట్టి పోరాడిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వర్ధంతి సభలో ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి ఎస్పీ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రిజర్వుడు ఆర్ఐ బ్రహ్మానందంతోపాటు ఎస్పీ కార్యాలయంలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొని అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక క్షత్రియ కల్యాణ మండపం ప్రాంగణంలోని అల్లూరి విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘన నివాళి

ముమ్మిడివరం: చినకొత్తలంకలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పి.ఉదయ భాస్కరవర్మ, పీవీవీవర్మ, ఎంపీటీసీ పొత్తూరి వీణారాణి, ముదునూరి పద్మనాభరాజు పాల్గొన్నారు.


తాళ్లరేవులో..

తాళ్లరేవు: మన్యం వీరుడు, స్వాతంత్య్ర పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, ఎఎస్ శ్రీనివాస్ తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అత్తిలి బాబూరావు, రాజబాబు, తణుకు రాంబాబు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు

యానాం: సాయుధపోరాటం ద్వారానే దేశానికి స్వాతంత్య్రం లభిస్తుందని నమ్మి ఆ దిశగా వీరోచిత పోరాటం చేసి తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయలని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని ఫెర్రీ రహదారిలో ఆయన విగ్రహానికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసి విప్లవ వీరుడు అల్లూరి తెలుగువారి పౌరుషాన్ని ప్రపంచానికి చాటారని కొనియాడారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక క్షత్రియ పరిషత్ నాయకులు పలువురు అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు, సీఐ అడలరసన్, ఎస్సై పునీత్‌రాజ్, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు, పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

సముద్రపు నాచు సాగుతో తీర ప్రాంత రైతులకు ఆదాయం


కాట్రేనికోన మండల మొల్లేటి మొగలో పడవలో పర్యటిస్తున్న నిపుణుల బృందం

అమలాపురం రూరల్: తీర ప్రాంత రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పర్యావరణ అనుకూలమైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కోనసీమ జిల్లాలో సముద్రపు నాచు సాగును (సీవీడ్ ఫామింగ్) పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. సముద్రపు నాచు సాగు పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన తమిళనాడు మండపంలోని సీఎస్ఐఆర్, సీఎస్ ఎంసీఆర్ఐలో శాస్త్రవేత్త డాక్టర్ సతీష్, జిల్లా మత్స్యశాఖ, అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ ఇతర నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సముద్రపు జలాల్లో సంబంధిత సాగును చేపట్టాలా లేదా తీర ప్రాంతాల్లో కృత్రిమంగా ఉప్పు నీటి చెరువులను ఏర్పాటు చేసి సాగు చేసే అంశంపై నిపుణుల క్షేత్రస్థాయిలో పర్యటించి అనువైన ప్రదేశాలను గుర్తిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం కాట్రేనికోన మండలంలోని కొత్తపాలెం, పల్లం, నీళ్లరేవు, చిరయానం, గచ్చకాయలపోర, ఉప్పలగుప్తం మండలంలోని ఎస్ కొత్తపల్లి, ఎస్ యానం, వాసాల తిప్ప,మామిడికుదురు మండలంలోని గోగన్నమఠం కరవాక గొల్లపాలెం తూర్పు పాలెం, సఖినేటిపల్లి మండలంలోని చింతల మోరి, కేశవదాసు పాలెం అంతర్వేది, గొంది ఎస్.రామేశ్వరం కొమరగిరిపట్నం ఓడరేవు రెబ్బనపల్లి తదితర గ్రామాల్లో సముద్రపు నాచు సాగుకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు డాక్టర్ సతీష్ నేతృత్వంలోని నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు రెండు రోజులు పాటు స్థల పరిశీలన చేపట్టారు. సముద్రపు నాచు నుంచి వచ్చే ఉప ఉత్పత్తులను ఆహార పదార్థాలు, ఔషధాలు, సౌందర్య సాధనాలు,ఆహార పరిశ్రమ ఔషధాల తయారీలో ఉపయోగిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో కే మాధవి, జిల్లా ఫిషరీస్ అధికారి పీవీ శ్రీనివాసరావు, కాకినాడ మత్స్యశాఖ ట్రైనింగ్ కేంద్రం ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాద్ రావు, నాబార్డ్ జిల్లా మేనేజర్ స్వామి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి వి బోసు బాబు, గ్రీన్‌క్లైమేట్ ఫండ్ ప్రతినిధి శ్రీహర్ష, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ నేతల దీక్ష


అమలాపురంలో రైతు రిలే దీక్షలో వైఎస్సార్‌సీపీ అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


రైతు రిలే దీక్షలో ముమ్మిడివరం నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పాల్గొన్న పార్టీ నాయకులు

అమలాపురం టౌన్/ ఉప్పలగుప్తం: రబీ రైతులకు అండగా జిల్లా వైఎస్సార్ సీపీ అమలాపురం కలెక్టరేట్ సమీపంలో బుధవారం నిర్వహించిన రైతు రిలే నిరాహార దీక్షల్లో అమలాపురం నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు కూర్చుని తమ నిరసనను తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ దీక్షల్లో పలువురు నియోజకవర్గ పార్టీ నాయకులు రైతులకు మద్దతుగా నిలిచి ప్రసంగించారు. పార్టీ అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం మండలాల అధ్యక్షులు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవి, కొనుకు బాపూజీ, అమలాపురం, అల్లవరం ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు సాదే శ్రీనువాసరావు, వడ్డి గంగ, జడ్పీటీసీ సభ్యులు గెద్దం సంపదరావు, కొనుకు గౌతమి, పార్టీ నాయకులు వంటిద్దు వెంకన్నాయుడు, కుడుపూడి బాబు, కుంచే వెంకటరమణారావు, కుడుపూడి భరత్ భూషణ్, సూదా గణపతి, మందపాటి కిరణ్‌కుమార్, పినిపే జయరాజు, కేతా భానుతేజ, కడిమి చిన్నవరాజు, పెయ్యల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, యనమదల పల్లంరాజు, నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు, కొల్లాటి దుర్గాబాయి, ఓగూరి విజయకుమార్, మోటూరి సత్యంకాపు, తిక్కా వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ నినాదాలతో ఉన్న ప్లకార్డులను దీక్షల్లో ప్రదర్శించి నిరసన తెలిపారు. తొలుత పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో భట్నవిల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు మోటారు సైకిళ్ల ర్యాలీతో దీక్షా శిబిరానికి చేరుకున్నారు. జై జగన్ అంటూ రైతులకు అండదండగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.

జయహో సైనికా


భారత సైన్యాన్ని కీర్తిస్తూ సంబరాలు చేసుకుంటున్న కోనసీమ జేఏసీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: భారత సైన్యం ఆపరేషన్ సింధూర్‌ను వీరోచితంగా నిర్వహించి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంపై కోనసీమ జేఏసీ కార్యవర్గం స్వాగతించింది. జేఏసీ కన్వీనర్ బండారు రామమోహనరావు ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో జేఏసీ ప్రతినిధులు బుధవారం సాయంత్రం ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై సంబరాలు చేసుకున్నారు. పహల్గాం దాడులతో మృతుల కుటుంబాలు ఎంతో క్షోభ అనుభవించాయని జేఏసీ కన్వీనర్ రామమోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులకు కేంద్రమైన ఉగ్రవాద శిబిరాలను మన సైన్యం ఇప్పుడు నేలమట్టం చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు గడియారం స్తంభం సెంటరులోని ప్రజలకు స్వీట్లు పంచి, బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సెంటరులో భారత సైన్యాన్ని కీర్తిస్తూ ర్యాలీ నిర్వహించారు. జేఏసీ ప్రతినిధులు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, కరాటం ప్రవీణ్, దంగుడు బియ్యం శ్రీనివాసరావు, నంద్యాల నాయుడు, జంగా రాజేంద్ర, ముత్యాల శరత్‌బాబు, మహ్మద్ జుబేర్ బాషా, కోకా అంజిబాబు, యర్రమిల్లి మూర్తి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్ పరీక్షలు


భట్లపాలెంలో బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధ్యాపకులు

అమలాపురం రూరల్: ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీ ఈసెట్) పరీక్షలు కోనసీమలో ప్రశాంతంగా జరిగాయి. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజనీరింగ్, అమలాపురంలో భట్లపాలెంలో బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు బుధవారం నిర్వహించారు. పాలిటెక్నిక్ డిప్లమో పూర్తిచేసిన విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్ష రాశారు. రెండు కళాశాలలో 800 మంది రెండు విడతలుగా పరీక్షలు రాశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు పరీక్షా కేంద్రాల్లో విడతకు 400 మంది చొప్పున ఒక రోజులో 800 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. భట్లపాలెం బీవీసీ కళాశాలలో మొత్తం 31 మంది గైర్హాజరైనట్టు కోఆర్డినేటర్ అడబాలకుమార్ తెలిపారు.

అవినీతిపై విచారణ చేయాలని ఎల్జీకి వినతి

యానాం: బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్, ఎన్డీయే కూటమి ప్రభుత్వాల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలంటూ బుధవారం పుదుచ్చేరి ఎంపీ వైథిలింగం తదితరులు ఆధ్వర్యంలో ఎల్జీ కె కైలాషనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో రూ.600 కోట్ల విలువైన కాంట్రాక్టు పనుల్లో 30శాతం కమీషన్ తీసుకున్నారన్న ఆరోపణపై చీఫ్ ఇంజనీర్‌ను సీబీఐ అరెస్ట్ చేసిందని వారు పేర్కొన్నారు. ఆలయం ఆస్తుల దోపిడీ కేసులో అక్కడి ఉన్నతాధికారుల అరెస్టు, సెంటాక్ అడ్మిషన్లలో ఎన్ఆర్ఐ కోటాలో భారీ అవినీతి కేసులను వారు ప్రస్తావించారు. పుదుచ్చేరిలో శాంతిభద్రతలు లోపించి హత్యలు సర్వసాధారణమయ్యాయని, గంజాయి విక్రయం, అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయని తెలిపారు. విలియనూర్‌లో బీజేపీ నేత హత్య, పుదుచ్చేరి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో అవినీతి, విద్యుత్‌లో ప్రీపెయిడ్ మీటర్ల ప్రాజెక్టు, టారిఫ్‌ల పెంపు, రేషన్ షాపులు తెరుస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం, పుదుచ్చేరికి రాష్ట్ర హోదా సాధనలో విఫలం తదితర అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు లక్ష మల్లెలతో పూజ


అమలాపురంలోని వాసవీ మాత

అమలాపురం టౌన్: వాసవీ అమ్మవారి జయంతి సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి లక్ష మల్లెల పూజ బుధవారం వైభవంగా నిర్వహించారు. పట్టణ వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా క్రతువులో తొలుత వాసవీ మాతను వెండి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ అమ్మవారికి లక్ష మల్లెల పూజతోపాటు విశేష పూజలు, పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన అన్న సమారాధనలో పట్టణానికి చెందిన వైశ్యులు పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి వాసవీ మాతకు పట్టు చీర, సారెను సమర్పించారు. ఈ పూజా కార్యక్రమాల్లో సంఘం కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, జిల్లా ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి, అమలాపురం వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, వరదా సూరిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ నివేదికలు కీలకం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం రూరల్: నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నివేదికలు కీలకమని వాటిపై పోలీసు అధికారులు అవగాహన పెంచుకుని నేరపరిశోధనలో మెరుగ్గా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో నేర పరిశోధనలో కీలక అంశాలపై జిల్లాలో పోలీసు అధికారులకు ఏపీ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నేర పరిశోధనలో భాగంగా ఆధారాలను సేకరించడం, వాటిని పంపించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి కేసులో సేకరించిన ఆధారాలను సరైన రీతిలో పంపడం వల్ల కేసుకు అవసరమైన ఖచ్చితమైన నివేదికను రూపొందించవచ్చని తెలిపారు. తద్వారా ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లు కేసుల్లో పురోగతిని సాధించవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసాద్, మురళిమోహన్, సీఐలు భీమరాజు, వీరబాబు, ప్రశాంతకుమార్ శ్రీనివాస్, రాజనీ కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న మల్లాడి

యానాం: ప్రపంచం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని దీనికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక సాంకేతికత నైపుణ్యాలను అలవర్చుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం జాతీయ టెక్నాలజీ డేను పురస్కరించుకుని స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ సాంకేతిక విద్య ద్వారా పలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణసుధాకర్, పీడబ్ల్యూడీ అధికారులు, ఇనస్ట్రక్టర్లు పాల్గొన్నారు.

బీజేపీ నేతలను కలసిన ఎమ్మెల్యేలు


సంతోష్‌ను కలసిన పుదుచ్చేరి ఎమ్మెల్యేలు, చిత్రంలో యానాం ఎమ్మెల్యే అశోక్

యానాం: పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతునిస్తున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు, పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు బుధవారం ఢిల్లీలో జాతీయస్థాయి బీజేపీ నేతలను కలిసారు.ఈ సందర్భంగా బీజేపీ జాతీయ జనరల్ సెక్రటరీ బీఎల్ సంతోష్ తదితరులతో వారు సమావేశమై పుదుచ్చేరిలో వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. యానాంకు సంబంధించి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు అంశాలను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వివరించి పూర్తి సహకారాన్ని కోరారు. అనంతరం బీపీపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్ తదితరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జాన్‌కుమార్, రిచర్డ్స్, శివశంకరన్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

తాళ్లరేవు: రేషన్‌కార్డు లేనివారు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పితాని త్రినాథరావు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులతోపాటు ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తులను అందజేయాలని తహసీల్దార్ కోరారు.

మైగ్రేషన్ ఎస్సీలకు న్యాయం చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో మైగ్రేషన్ ఎస్సీలుగా ఉంటున్న వారి హక్కులపై కుల ధ్రువీకరణ తదితర పత్రాల జారీపై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సీఎం రంగసామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యదర్శి ఎస్ రామచంద్రన్ మట్లాడుతూ పుదుచ్చేరి జనాభా మొత్తం 1.4 మిలియన్లని, ప్రభుత్వ లెక్కల ప్రకారం 60 శాతం ఎస్సీ జనాభా ఉందని తెలిపారు. 1964 జీఓ ద్వారా సబ్‌ప్లాన్ సంక్షేమ నిధులు, ఉద్యోగాలు, పదోన్నతులు, స్కాలర్‌షిప్‌లు ఆరిజన్ ఎస్సీలకే దక్కుతున్నాయని దీంతో మైగ్రేషన్ ఎస్సీలు అన్యాయమవుతున్నారన్నారు. ఇటీవలి హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మైగ్రేషన్ ఎస్సీలను విస్మరించడం కోర్టు ధిక్కారంగా వస్తుందని తక్షణం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు.